క్లుప్తంగా

విత్తనశుద్ధితో మేలు



విత్తనశుద్ధిపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ ప్రతినిధులు

దెంకాడ: ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో భాగంగా విత్తనశుద్ధి చేయడం వల్ల పలు రకాల చీడ పీడలను నివారించవచ్చని ఏపీసీఎన్ఎఫ్ బి.సుజాత అన్నారు. మండలంలోని గుణుపూరులో విత్తనశుద్ధిపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రకృతి సిద్ధంగా లభించే పదార్థాలు, వస్తువులతో పురుగు నివారణ మందులు తయారు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సీఆర్పీ ఎస్.ఉమామహేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

పవన్ నిర్ణయం సరికాదు..

నెల్లిమర్ల రూరల్: రాష్ట్రానికి తీవ్ర ద్రోహం చేసిన బీజేపీకి జనసేన అధినేత పవన్‌కల్యాణ్ మద్దతివ్వడాన్ని రాష్ట్ర ప్రజలు హర్షించరని సీపీఐ మండల కార్యదర్శి మొయిద పాపారావు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. ప్రత్యేక హోదా, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకించిన పవన్.. కేంద్రంలో బీజేపీ కూటమికి ఎలా మద్దతిస్తారని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వాన్ని ఎదురిస్తున్న స్థానిక పార్టీల నాయకులను ఈడీ, సీబీఐ సంస్థలచే వేధింపులకు గురి చేస్తున్నారని చెప్పారు. ఐఎన్‌డీఐఏ కూటమికి ప్రజలు మద్దతివ్వాలని పిలుపునిచ్చారు.

సేవలు సద్వినియోగం చేసుకోవాలి



చిన్నారికి ఫిజియోథెరపీ చేస్తున్న హిమబిందు

పూసపాటిరేగ: ప్రత్యేక అవసరాలు గల చిన్నారులు ఫిజియోథెరపీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఫిజియోథెరపిస్ట్ హిమబిందు అన్నారు. బుధవారం స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఫిజియోథెరపీ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వివిధ రుగ్మతలతో బాధపడుతున్న వ్యక్తులు భవిత కేంద్రం సేవలు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐఆర్‌టీలు ఎన్.బంగారు నాయుడు, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామ పెద్దలు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని జరజాపుపేట ఉన్నత పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయ సిబ్బందిని బుధవారం సన్మానించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల ఆధ్వర్యంలో బదిలీపై వెళ్లిన రాధాకృష్ణ, రాజేష్, రామారావు, ప్రభాకర్, రాజేశ్వరి, రమాదేవిలను సన్మానించి, వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, గ్రామ పెద్దలు పోలుబోతు నారాయణమూర్తి, తుమ్మి నారాయణమూర్తి, కనకల హైమావతి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు, తదితరులు

విజయనగరం క్రైమ్: పదో తరగతి ఫలితాల్లో (2023) ఉత్తమ ప్రతిభ కనబరిచిన స్థానిక కంటోన్మెంట్ ప్రభుత్వ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులను వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు బుధవారం అభినందించారు. ఐ. లోకేష్ (587 మార్కులు), టి.ప్రశాంతి (582), ఆర్.విష్ణుప్రియలను (565) సత్కరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, ఇద్దరు విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీట్లు సంపాదించడం అభినందనీయమన్నారు. బాగా చదువుకుని బాధ్యత కలిగిన వ్యక్తులుగా నడుచుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఎం.కాంచన, వన్‌టౌన్ ఎస్సై భాస్కరరావు, ఇతర ఉపాధ్యాయులు, స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కొత్తవలస: వియ్యంపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో కొత్తవలస మండలం అప్పన్నపాలెం, వేపాడ మండలం బానాది-2, ఆకులసీతంపేట అంగన్‌వాడీ కేంద్రాల్లో సహాయకుల ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రాజెక్టు అధికారి ఆర్.ఉమాదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసైన 21 నుంచి 35 ఏళ్ల మధ్య వయసు కలిగిన స్థానిక మహిళలు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులుగా పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 22వ తేదీ సాయంత్రం 5 గంటల లోగా కొత్తవలస మండలం గిడిజాల రోడ్డులో కుమ్మరిబంజిరి వద్ద ఉన్న ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు.

అర్హులందరికీ నవరత్నాలు

- డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ముచ్చు లయాయాదవ్
- 23వ డివిజన్‌లో 'గడప గడపకు...'



లబ్ధిదారుతో మాట్లాడుతున్న నగర డిప్యూటీ మేయర్లు

విజయనగరం: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు అర్హులైన వారందరికీ నవరత్నాలు అమలు చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. నగరంలోని 23వ డివిజన్ వైష్ణవవీధి నుంచి బుధవారం ప్రారంభమైన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ముచ్చు లయాయాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు ఏ విధంగా అందుతున్నాయి.. ప్రభుత్వ పనితీరుపై ఆరా తీశారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారి వివరాలు సేకరించారు. అలాగే స్థానిక సమస్యలపై ఆరా తీసి, వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం డిప్యూటీ మేయర్ ముచ్చు లయాయాదవ్ మాట్లాడుతూ, అవినీతిరహితంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని చెప్పారు. సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందుతున్నాయా, లేదా అని తెలుసుకునేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించడం సాహసోపేతమైన చర్య అని చెప్పారు. ప్రతి ఇంటికీ ఏదో ఒక పథకం అందుతుండడంతో ప్రజలందరూ వైఎస్సార్‌సీపీ పాలనపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు కేదారశెట్టి లక్ష్మణమూర్తి మాట్లాడుతూ, తమ డివిజన్‌లో అర్హులైన వారందరికీ పథకాలు అందే విధంగా చూస్తున్నామన్నారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నేతృత్వంలో తమ డివిజన్‌లో అభివృద్ధి కార్యక్రమాలు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ శశిభార్గవి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను సంరక్షించుకోవాలి



వైఎస్సార్‌నగర్‌లో రోడ్డు నిర్మాణానికి సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న నగర మేయర్, డిప్యూటీ మేయర్లు

- 34వ డివిజన్‌లో రూ.24 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- నగర మేయర్, డిప్యూటీ మేయర్లు

విజయనగరం: గతంలో ఎన్నడూ లేనివిధంగా విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. 34వ డివిజన్‌లోని వైఎస్సార్ నగర్, ప్రదీప్‌నగర్ ప్రాంతాలలో రూ.24 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ముచ్చు లయాయాదవ్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ, శంకుస్థాపనల మాస మహోత్సవాలలో భాగంగా అభివృద్ధి పనులు ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. అన్ని ప్రాంతాలలో గతంలో గుర్తించిన పలు సమస్యలను పరిష్కరించే దిశగా అభివృద్ధి కార్యక్రమాలు ముమ్మరంగా సాగుతున్నాయని చెప్పారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి స్వీయ పర్యవేక్షణలో నగరం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. చేస్తున్న అభివృద్ధి పనులకు ప్రజలు కూడా సహకరించి అందరికీ ఉపయోగకరంగా ఉండేవిధంగా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జోనల్ ఇన్‌చార్జ్‌లు బొద్దాన అప్పారావు, రెడ్డి గురుమూర్తి, పార్టీ నాయకులు బీవీ రవిచంద్ర, బి.ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

అంకితభావం తప్పనిసరి



స్టాఫ్‌నర్సులకు నియామక పత్రాలు అందజేస్తున్న డీసీహెచ్ఎస్ గౌరీశంకర్

- డీసీహెచ్ఎస్ గౌరీశంకర్

విజయనగరం ఫోర్ట్: వృత్తిపట్ల ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పనిచేయాలని డీసీహెచ్ఎస్ డాక్టర్ బి.గౌరీశంకర్ అన్నారు. బుధవారం స్థానిక డీసీహెచ్ఎస్ కార్యాలయంలో స్టాఫ్‌నర్సులుగా ఎంపికైన వారికి మూమెంట్ ఆర్డర్స్ అందజేశారు. పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో ఆరుగురికి, కురుపాంలో ఒకరికి ఆర్డర్లు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సేవచేసే అదృష్టం కొంతమందికే వస్తుందన్నారు. రోగులకు ప్రేమతో, అప్యాయంగా సేవలు అందించాలని సూచించారు.

శ్మశానవాటిక అభివృద్ధికి విరాళం



గ్రామపెద్దలకు విరాళం అందిస్తున్న దాతలు

నెల్లిమర్ల రూరల్: పట్టణ పరిధిలోని జరజాపుపేట స్వర్గధామం అభివృద్ధికి ఆ గ్రామానికి చెందిన బోలె కుటుంబ సభ్యులు రూ.2 లక్షల విరాళం బుధవారం అందజేశారు. బోలె శంకరరావు, త్రినాథ్ తమ తండ్రి రామునాయుడు జ్ఞాపకార్థం గ్రామ పెద్దలకు నగదు అందజేసి, అనంతరం అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, పెద్దలు నల్లి చంద్రశేఖర్, అవనాపు సత్యనారాయణ, కిల్లంపల్లి రామారావు, తాలాడ సన్నిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఫీవర్ సర్వే చేపట్టండి

- నగర పంచాయతీ కమిషనర్ బాలాజీప్రసాద్



సిబ్బందికి సూచనలు చేస్తున్న కమిషనర్ బాలాజీ ప్రసాద్

నెల్లిమర్ల రూరల్: పట్టణంలోని అన్ని వార్డుల్లో ఫీవర్ సర్వే చేపట్టాలని నగర పంచాయతీ కమిషనర్ బాలాజీ ప్రసాద్ సూచించారు. బుధవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో వార్డు శానిటేషన్ కార్యదర్శులు, మెప్మా, వైద్య, ఆరోగ్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు నిర్వహిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్యారోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి జ్వర పీడితులను గుర్తించి అవసరమైన మందులు, వైద్యం అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో మేనేజర్ టీవీఎస్ విశ్వేశ్వరరావు, మెప్మా సీఎంఎం గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

బంగారునాయుడు సేవలు మరువలేం

- ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు



బంగారునాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, తదితరులు

నెల్లిమర్ల రూరల్: విద్యారంగానికి విశ్రాంత ప్రిన్సిపాల్ బోని బంగారునాయుడు చేసిన సేవలు మరువలేనివని ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేటలో విశ్రాంత ప్రిన్సిపాల్ బంగారునాయుడు సంతాపసభ బుధవారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఎమ్మెల్సీ నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఎంతోమంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దిన ఘనత మాష్టారుకే దక్కుతుందని కొనియాడారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్‌చైర్మన్ సముద్రపు రామారావు, నల్లి చంద్రశేఖర్, ఎంఎం నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు విస్తరించాలి

- ఎంపీ బెల్లాన చంద్రశేఖర్



నూతన అధ్యక్షులను అభినందిస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో లైన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. పట్టణంలోని బీఎస్ లయన్స్ కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం రాత్రి లయన్స్ క్లబ్, స్టార్స్ లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ చంద్రశేఖర్ లయన్స్ క్లబ్, స్టార్స్ లయన్స్ క్లబ్‌ల సేవలను కొనియాడుతూ.. క్లబ్ ప్రతినిధులను అభినందించారు. మారుమూల గ్రామాల్లో విద్య, వైద్యం, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషిచేస్తోందని, స్వచ్ఛంద సంస్థలు కూడా ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా ప్రజలకు సేవలందించాలని కోరారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ కమ్యూనిటీ హాల్‌లో అదనపు భవనం నిర్మాణానికి రూ.10 లక్షలు నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు

లయన్స్ క్లబ్, స్టార్స్ లయన్స్ క్లబ్‌లకు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్టార్స్ లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా ఎస్‌వీజీ శ్రీనివాసరావు, కార్యదర్శిగా కె.కిరణ్, కోశాధికారిగా ఒమ్మి రమేష్, లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా ఎస్‌వీ దుర్గారావు, కార్యదర్శిగా కోరాడ శంకరరావు, కోశాధికారిగా కె.నాగశంకర్‌లను ఎన్నుకున్నారు. వారితో లయన్స్ క్లబ్ మాజీ మల్టిపుల్ కౌన్సిల్ సెక్రటరీ, ఫేకర్ సీఈ ఎంఎస్ఎస్ శర్మ ప్రమాణం చేయించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అభినందించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు ఎస్.సన్యాసిరావు, బెల్లాన వంశీకృష్ణ, ఎస్.రాధాకృష్ణ, కందుల పుండరీ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న హయాంలో పారదర్శక పాలన



గుంపాంలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందచేస్తున్న జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసరావు, సర్పంచ్ రఘు, తదితరులు

పూసపాటిరేగ: ముఖ్యమంత్రి జగనన్న హయాంలో పారదర్శక పాలన అందుతోందని సర్పంచ్‌లు కోట్ల రఘు, ఎడ్ల ఆదిలక్ష్మి అన్నారు. మండలంలోని గుంపాం, చింతపల్లి -2 సచివాలయాల పరిధిలో ఎంపీడీఓ జి. రామారావు ఆధ్వర్యంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా 1191 మందికి వివిధ రకాల ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు మాట్లాడుతూ, పాలనను ప్రజలకు చేరువ చేసేందుకు వలంటీర్, సచివాలయ వ్యవస్థలను తీసుకువచ్చారన్నారు. ప్రభుత్వ పథకాలు నేరుగా లబ్ధిదారులు బ్యాంక్ ఖాతాలకు జమ చేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని తెలిపారు. ప్రజలకు సులభతరంగా వారికి అవసరమైన ధృవపత్రాలు, ఇతర సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం అమలు చేస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా 11 రకాల ధృవపత్రాలు ఉచితంగా అందజేయడంతోపాటు అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారికి పథకాలు వర్తించేలా చర్యలు తీసుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఇ.భాస్కరరావు, డిప్యూటీ తహసీల్దార్ లావణ్య, సర్పంచ్ బర్రి మొసలి, ఏపీఓ రత్నమాల, ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు ఎడ్ల రామకృష్ణ, కోట్ల పరిసినాయుడు, బర్రి చినఅప్పన్న పాల్గొన్నారు.

న్యాయవాదులకు రక్షణ కల్పించాలి

శృంగవరపుకోట: న్యాయవాదుల పరిరక్షణ చట్టాన్ని తక్షణమే అమల్లోకి తీసుకొచ్చి న్యాయవాదులపై జరుగుతున్న దాడులను నివారించాలని ఎస్.కోట బార్ అసోసియేషన్ న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో నినాదాలు చేశారు. అవనిగడ్డ కోర్టులో న్యాయవాది శ్రీనివాసరావుపై జరిగిన దాడిని ఖండిస్తూ విధులను బహిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అల్లు సత్యాజీ, డబ్ల్యూ.ఎన్.శర్మ మాట్లాడుతూ.. అవనిగడ్డ బార్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాసరావుపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో న్యాయవాదులపై జరుగుతున్న దాడులను అరికట్టి, వారికి రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు జి.ప్రకాష్, బి.త్రిమూర్తులు, టి.వి.ఆర్.మూర్తి, బి.సత్యనారాయణ, ఆర్.సత్యనారాయణ, బి.వెంకటరావు, ఎం.అనూరాధ, ఎం.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

బతుకు పోరాటం..

ఎండ బాగా ఎక్కువగా ఉంటే చేసే పనిని కాసేపు పక్కనబెడతాం... అదే జోరుగా వర్షం కురిస్తే పనికి విరామం ఇస్తాం.. కాని వారికి ఎండైనా, వానైనా ఒకటే.. కష్టపడడం ఒక్కటే వారికి తెలిసిన విద్య. అది ఎండలో కావచ్చు.. వానలో కావచ్చు.. జిల్లా కేంద్రంలోని పలువురు బుధవారం ఉదయం జోరువానలో పనిచేస్తూ సాక్షి కంట బడ్డారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం



పండ్లు అమ్ముతున్న మహిళ



బూడిద గుమ్మడికాయలను విక్రయిస్తున్న మహిళా వ్యాపారి



వయసు పైబడినా ఆగని జీవన చక్రం



అమ్మకానికి అరటి ఆకులు తీసుకెళ్తున్న మహిళ



జోరువానలో కిరాయికి వెళ్తున్న రిక్షా కార్మికుడు

బైక్‌ను ఢీకొన్న లారీ

- వ్యక్తికి తీవ్రగాయాలు

జామి: లారీ, బైక్‌ని ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అందించిన సమాచారం మేరకు అలమండ గ్రామానికి చెందిన అయినంపూడి సత్యనారాయణరాజు కంటకాపల్లి నుంచి బైక్‌పై అలమండ వస్తున్న సమయంలో విజయనగరం నుంచి వస్తున్న లారీ అలమండ పెట్రోల్ బంకు సమీపంలో ప్రధాన రహదారిపై బైక్‌ను ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. తీవ్రంగా గాయపడిన సత్యనారాయణరాజును స్థానికులు 108 అంబులెన్స్‌లో విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడు శ్రీచక్ర సిమెంట్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నట్లు తెలిసింది.